PRGI REGD NO: TGTEL/25/A1385

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 16-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 287 Issue: 287

16 ఏప్రిల్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:28 తిథి చతుర్దశి రా. 8:07 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం ఉత్తరాభాద్ర మ. 1:46 వరకు తరువాత రేవతి యోగం ఇంద్ర ఉ. 10:26 వరకు కరణం విష్టి ఉ. 9:23 వరకు శకుని రా. 8:07 వరకు వర్జ్యం రా. 1:00 నుండి రా. 2:28 వరకు దుర్ముహూర్తం ఉ. 10:11 నుండి ఉ. 11:01 వరకు మ. 3:09 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:49 నుండి మ. 3:22 వరకు యమగండం ఉ. 6:03 నుండి ఉ. 7:36 వరకు గుళికాకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:42 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు ఉ. 9:27 నుండి ఉ. 10:58 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:40 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana


## ఇది నిరుద్యోగ భారతం




**5.1 శాతానికి అన్‌ఎంప్లాయ్‌మెంట్**

**ఐదు నెలల గరిష్ఠానికి చేరిక**

న్యూఢిల్లీ: పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు పెరిగింది. గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ బుధవారం విడుదల చేసిన కార్మిక సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటా ప్రకారం, ఈ ఏడాది మార్చి నెలకు సంబంధించి దేశంలో నిరుద్యోగ రేటు 5.1 శాతానికి పెరిగింది. ఇది గడిచిన నెలల్లోనే అత్యధికమని పీఎల్ఎఫ్ఎస్ పేర్కొంది. అంతకుముందు నెలలో ఇది 4.9 శాతంగా నమోదైంది. సమీక్షించిన నెలలో పట్టణ నిరుద్యోగం 0.2 శాతం పెరిగి 6.8 శాతం పెరగ్గా, గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం కూడా స్వల్పంగా 4.3 శాతానికి చేరింది. పురుషుల్లో నిరుద్యోగం 5 శాతానికి చేరగా, మహిళల్లోనూ కొంత పెరిగి 5.3 శాతానికి పెరిగినట్టు పీఎల్ఎఫ్ఎస్ డేటా పేర్కొంది.




## ఇది అప్పుల ప్రపంచం

**జీడీపీలో 94 శాతం అప్పులు**

**2029 నాటికి 100 శాతానికి చేరిక**

**ఐఎంఎఫ్ హెచ్చరికలు**

వాషింగ్టన్ డీసీ: అభివృద్ధి చెందిన, చెందుతున్న ఆర్థికవ్యవస్థలలో ద్రవ్యపరమైన ఒత్తిళ్లు తీవ్రమవుతున్నందున, ప్రపంచ దేశాల అప్పులు ఆందోళనకర స్థాయికి పెరగనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ(ఐఎంఎఫ్) హెచ్చరించింది. 2029 నాటికి ఇది ప్రపంచ జీడీపీలో 100 శాతానికి చేరవచ్చని అంచనా చేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులు క్రమంగా క్షీణిస్తున్నాయి. 2025 తరువాయి 2 వ పేజీలో...




## ఇది యాపారం!

**భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా**

**2025-26లో అమెరికాను వెనక్కినెట్టిన డ్రాగన్**

న్యూఢిల్లీ: 2025--26 ఆర్థిక సంవత్సరంలో అమెరికాను అధిగమించి చైనా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అవతరించింది. భారత్-చైనా ద్వైపాక్షిక వాణిజ్యం 155 బిలియన్ డాలర్లు (రూ.14.09 లక్షలకోట్లు) రికార్డు స్థాయికి చేరుకుంది, అయితే తరువాయి 2 వ పేజీలో...



## చైనా మాటిచ్చింది

**ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వనంది**

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి**

వాషింగ్టన్: హర్మూజ్ జలసంధి దిగ్బంధనంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'హర్మూజ్‌ను శాశ్వతంగా తెరిచి ఉంచుతాం.. దీంతో చైనాతో పాటు ప్రపంచమంతా లాభపడుతుంది. మా నిర్ణయం పట్ల చైనా సంతోషంగా ఉంది. ఇరాన్‌కు ఆయుధాలు ఇవ్వబోమని చైనా చెప్పింది' అంటూ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఈ కీలకమైన జలసంధి ఇకపై ఎన్నడూ మూతపడదని ఆయన -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,535 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,302 |

## విశ్వవాణి



అమెరికాలో శిశు జననాల రేటు దారుణంగా పడిపోయింది. 20-39 ఏళ్ల వయస్కుల మహిళల్లో 52 శాతం మందికి పిల్లలు లేరంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2000 సంవత్సరంలో మొదలైన జననాల తగ్గుదల రానురానూ భారీగా క్షీణిస్తోంది.

# డీ లిమిటేషన్



భారత ప్రజాస్వామ్య చరిత్రలో మరో కీలక ఘట్టానికి గురువారం పార్లమెంట్ వేదిక కానుంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెంచే ప్రతిపాదనతో కూడిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు-2026పై గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలును ఈ ప్రక్రియతో ముడిపెట్టడం వల్ల ఈ చర్చ మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ బిల్లుల వెనుక ప్రధానంగా రెండు భిన్న కోణాలు కనిపిస్తున్నాయి. ఒకటి-పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని పెంచడం.

## ఇండియా వర్సెస్ ఎన్డీయే

**బిల్లును వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షం.. వెల్లడించిన ఏఐసీసీ చీఫ్ ఖర్గే**

**ప్రతి రాష్ట్రంలో 50% సీట్ల పెంపు.. క్లారిటీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం**

**నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు**

న్యూఢిల్లీ: రెండు-ఈ ప్రక్రియ వల్ల రాష్ట్రాల మధ్య తలెత్తే రాజకీయ అసమానతలు. 1976 నుంచి నియోజకవర్గాల సంఖ్యపై ఉన్న స్తంభనను తొలగించాలని కేంద్రం భావిస్తుండగా, ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని విపక్షాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు, తక్కువ జనాభా ఉన్నందున తమ పార్లమెంట్ ప్రాతినిధ్యాన్ని కోల్పోతామని భయపడుతున్నాయి. దీనికి విరుద్ధంగా, ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగే అవకాశం ఉండటం 'జనాభా శిక్ష'గా మారుతుందన్నది ప్రధాన విమర్శ. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా 50 శాతం పెంచుతామని, ఏ రాష్ట్రమూ తన ప్రస్తుత బలాన్ని కోల్పోదని కేంద్రం హామీ ఇస్తోంది. అయితే, ఈ పెంపు వల్ల అంతిమంగా ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య ఉండే సీట్ల వ్యత్యాసం మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే, 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలంటే డీలిమిటేషన్ తప్పనిసరి అని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ, విపక్షాలు దీనిని ఒక రాజకీయ ఎత్తుగడగా, డీలిమిటేషన్‌కు రక్షణ తరువాయి 2 వ పేజీలో...



## బీహార్ పీఠంపై కమలం!

**తొలి బీజేపీ సీఎంగా సామ్రాట్ చౌదరి**

బీహార్ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త శకం ప్రారంభమైంది. ఆ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా భారతీయ జనతా పార్టీకి చెందిన నేత ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి నేడు ప్రమాణ స్వీకారం చేశారు. దశాబ్దాల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలన సాగించిన జేడీయూ అధినేత నితీష్ కుమార్ ఇటీవలే రాజ్యసభకు ఎన్నికయ్యారు.

పాట్నా: ఆయన సీఎం పదవికి రాజీనామా చేయడంతో రాష్ట్రంలో నాయకత్వ మార్పు అనివార్యమైంది. అసెంబ్లీలో 89 మంది ఎమ్మెల్యేలతో అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీకే ఈసారి ముఖ్యమంత్రి పీఠం దక్కింది. నితీష్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సామ్రాట్ చౌదరిని బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా -2 వ పేజీలో...



## రేవంత్ లిమిటెడ్ కంపెనీ

**పార్టీలోకి ఉడుం లెక్క వచ్చిండు.. ఉన్నోళ్లను తొక్కుకుంటూ మెట్లెక్కిండు**

**పొమ్మనలేక నాకు పొగబెట్టిండు.. మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆవేదన**

కాంగ్రెస్ పార్టీ, జీవన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం ఆగడం లేదు. పార్టీకి గుడ్‌బై చెప్పిన జీవన్ రెడ్డి.. త్వరలోనే కారెక్కేందుకు రెడీ అవుతున్న వేళ.. తన మాటల దాడిని మరింత పెంచారు. మంగళవారం జగిత్యాల కాంగ్రెస్ నేతలతో సమావేశమై చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి.. జీవన్ రెడ్డిపై విమర్శలు చేశారు. 4 దశాబ్దాలుగా కార్యకర్తలను తన వెంట తిప్పుకుని ఇప్పుడు మోసం చేసి బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నారని మండిపడ్డారు.

రాయికల్/జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 15 (ఈవార్తలు): సీఎం వ్యాఖ్యలకు తాజాగా జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మారిపోయిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాలను పార్టీపై రుద్దుతున్నారని, పాత నాయకులను పట్టించుకోవడం లేదని, పార్టీ అధిష్ఠానం కూడా రేవంత్ రెడ్డి చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఒక తరువాయి 2 వ పేజీలో...



## బయటికి వస్తే బొగ్గే!

**మూడ్రోజులు పెరగనున్న ఉష్ణోగ్రతలు**

**తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం**

**పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ**

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఏప్రిల్ మధ్యలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. భారత వాతావరణ శాఖ ఏప్రిల్ 16 నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ, తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని తరువాయి 2 వ పేజీలో...



## ప్రజలతో ఒట్లు.. ప్రధాని బెట్టు

**9 హామీలపై ప్రమాణం చేయించుకున్న మోదీ**

## సరిహద్దులో 800 మంది ఉగ్రవాదులు

**భారత్‌లో చొరబాటుకు రెడీ**

**పాక్ భారీ కుట్రను పసిగట్టిన నిఘా వర్గాలు**



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించడం కోసం పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం కలిసి ఈ ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు తరువాయి 2 వ పేజీలో...



2

## అండమాన్‌లో 250 మంది గల్లంతు

**రోహింగ్యా శరణార్థుల పడవ బోల్తా**

**అధికులు బంగ్లాదేశ్ జాతీయులే**

# రాశి ఫలాలు



16.4.2026

**మేషం:** ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆర్థికంగా పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన విషయాలు తెలుసుకుంటారు. వ్యాపారాలలో అంచనాలు అందుకోవడానికి చేసే ప్రయత్నాలు సఫలమౌతాయి. దైవ చింతన పెరుగుతుంది.

**వృషభం:** సన్నిహితులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దూరప్రాంత బంధుమిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనులు వేగంగా పూర్తిచేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన మార్పులు చోటుచేసుకుంటాయి.

**మిధునం:** ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారమున గందరగోళ పరిస్థితులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి.

**కర్కాటకం:** కుటుంబ విషయంలో ఆలోచనలు స్థిరత్వం లోపిస్తుంది. బంధుమిత్రులతో కలహా సూచనలున్నవి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన నిరాశ కలిగిస్తుంది. నిరుద్యోగులకు ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి.

**సింహం:** ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. దూరపు బంధుమిత్రుల రాకతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. సంతాన విద్యా విషయాల్లో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**కన్య:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపార వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది.

**తుల:** వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత మానసిక చికాకు కలిగిస్తుంది. ప్రారంభించిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. దైవ చింతన కలుగుతుంది.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చిన్ననాటి మిత్రులతో విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనస్సు:** ఆర్థిక లావాదేవీలు ఆశించిన విధంగా సాగుతాయి. బంధు మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. స్థిరాస్తి క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో నూతన అవకాశాలు అందుకుంటారు. నిరుద్యోగులకు కార్యసిద్ధి కలుగుతుంది.

**మకరం:** బంధువుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగమున అదనపు బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు చే పట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు అందక ఇబ్బంది కలుగుతుంది. ప్రయాణాలలో తొందరపాటు మంచిదికాదు.

**కుంభం:** ఆర్థిక పురోగతి సాధిస్తారు. నిరుద్యోగ యత్నాలు సానుకూల ఫలితాన్నిస్తాయి. సంఘంలో విశేషమైన ఆదరణ లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారములలో స్వంత నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. వృత్తిఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

**మీనం:** సన్నిహితులతో మాట పట్టింపులుంటాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు వేధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు రాణించక ఇబ్బందిపడతారు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగమున అధికారులతో అలోచించి మాట్లాడటం మంచిది.

# డీ లిమిటేషన్



**మొదటి పేజీ తరువాయి**

కవచంగా చూస్తున్నాయి. డీలిమిటేషన్‌పై కేంద్రం బుధవారం స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఉన్న సీట్లకు 50 శాతం పెంచుతున్నట్లు పేర్కొంది. బిల్లులో ఈ విషయం స్పష్టంగా ఉందన్న సమాచార శాఖ.. పార్లమెంట్ చర్చ సందర్భంగా మరింత క్లారిటీ ఇస్తామని తెలిపింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఢిలిమిటేషన్ ఉంటుందన్న అపోహలను కేంద్రం కొట్టిపారేసింది. ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడులో 58కి, కేరళంలో 30కి పెరుగుతాయన్న కేంద్రం.. డీలిమిటేషన్‌తో దక్షిణాదిలో సీట్లు తగ్గవని తెలిపింది. రాష్ట్రాలకు చట్టబద్ధ రక్షణ ఉంటుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బిల్లులోని అంశాలను ముక్కలుగా చదవి విశ్లేషించొద్దని కేంద్రం పేర్కొంది. డీలిమిటేషన్ 2011 జనాభా లెక్కల ఆధారంగా కాకుండా తాజాగా జరుగుతున్న జనగణన ప్రాతిపదికన జరగాలని ఆప్, ఆర్జేడీ వంటి పార్టీలు డిమండ్ చేస్తున్నాయి. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదానికి ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ఇందుకు విపక్షాల మద్దతు మోదీ ప్రభుత్వానికి తప్పనిసరి. ఈ నేపథ్యంలో సమావేశాలు వాడీవేడిగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. పార్లమెంటు సమావేశాలకు విధిగా హాజరు కావాలంటూ బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికే తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి.

డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం: ఖర్గే

డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారు. బుధవారం సాయంత్రం ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రేపటి నుంచి మూడు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రెండు గంటల పాటు నేతల మధ్య సమావేశం జరిగింది. అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కూటమి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కానీ డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లుగా వెల్లడించారు. "మేము మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదు. కానీ ప్రభుత్వం బిల్లులను తీసుకువస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇది రాజకీయ ప్రేరేపితం. మేము డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నాం." అని ఖర్గే అన్నారు. గురువారం నుంచి 3 రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై చర్చించనున్నారు. అయితే తాజాగా బిల్లులపై ఇండియా కూటమి భిన్న స్వరం వినిపించింది. దీంతో మరోసారి పార్లమెంట్ ఉభయ సభల్లో రగడ జరగడం ఖాయంగా అనిపిస్తోంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని.. ఉత్తరాది రాష్ట్రాలు మేలు పొందుతాయని దక్షిణాది రాష్ట్ర నాయకులు ఆరోపిస్తున్నారు.

# ఇది అప్పుల ప్రపంచం

**మొదటి పేజీ తరువాయి**

నాటికే ప్రపంచ రుణం జీడీపీలో సుమారు 94 శాతానికి చేరింది. నిరంతర లోటు, పెరిగిన వడ్డీ ఖర్చులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దీనికి ప్రధాన కారణాలని ఐఎంఎఫ్ పేర్కొంది. అవి ఇంకా పెరుగుతూనే ఉంటాయని అంచనా. ఇటీవలి పశ్చిమాసియా ఘర్షణలు, భౌగోళిక సమస్యలు ఇంధన ధరలను పెంచి ప్రపంచ ఆర్థిక పరిస్థితులను మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహార, ఇంధన ధరలు కూడా పెరుగుతున్నాయి. ఈ ప్రభావం ముఖ్యంగా దిగుమతి ఆధారిత, తక్కువ ఆదాయ దేశాలపై ఎక్కువగా పడుతోంది. తద్వారా ఈ దేశాలు అధిక ఖర్చులు, పరిమిత ఆర్థిక వెసులుబాటు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అయితే, ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్‌తో పాటు మెక్సికో, టర్కీ వంటి దేశాలు కొంత మెరుగైన ఆర్థిక స్థితిలో ఉన్నాయి. భారత్‌లో ఖర్చుల నియంత్రణ సరిగ్గానే ఉందని, అత్యంత పటిష్టమైన వృద్ధి ఇందుకు కారణమని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. భారత రుణ-జీడీపీ నిష్పత్తి ఇంకా 84 శాతం కంటే ఎక్కువగా ఉంది. మనదేశం తర్వాత మధ్యస్థంగా అప్పుల భారం ఉన్న దేశాల్లో బ్రెజిల్(90 శాతం), చైనా(100 శాతం), యూకే(105 శాతం), కెనడా(105 శాతం), స్పెయిన్(110 శాతం) ఉన్నాయి. అంతర్జాతీయ సంక్షోభాలు కొనసాగితే ఇంధన ధరలు, నిధులు, ఆర్థిక నిర్వహణపై ఒత్తిడి పెరుగుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. గత దశాబ్దంతో పోలిస్తే అదనంగా డబ్బు ఖర్చు చేయడానికి లేదా అప్పు తీసుకోవడానికి ఉన్న సామర్థ్యం ప్రపంచ దేశాల్లో చాలా తగ్గిపోయింది. ప్రస్తుతం చాలా దేశాలు అధిక వడ్డీ రేట్లతో రుణాలు తీసుకోవాల్సి వస్తోంది, దీంతో వడ్డీ భారం వేగంగా పెరుగుతోంది. జపాన్(జీడీపీలో 240 శాతం అప్పుల భారం), సింగపూర్(180 శాతం), గ్రీస్(170 శాతం), ఇటలీ(145 శాతం), అమెరికా(125 శాతం) దేశాలు భారీ అప్పులను ఎదుర్కొంటున్నాయి. రష్యా, సౌదీ అరేబియా, యూఏఈ, ఆస్ట్రేలియా, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు 20-65 శాతం మధ్య తక్కువ రుణాలు కలిగి ఉన్నాయి.

# రేవంత్ లిమిటెడ్ కంపెనీ

**మొదటి పేజీ తరువాయి**

ఉడుం లాగా చొచ్చుకొచ్చారని జీవన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రేవంత్ రెడ్డి రావడంతోనే కాంగ్రెస్ పార్టీలో ఒక గీత గీసుకున్నారని.. పార్టీలో ఉన్న నేతలను ఎలా తొక్కాలి.. ఒక్కో మెట్టు ఎలా ఎక్కాలి అనేదే టార్గెట్‌గా పనిచేశారని మండిపడ్డారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న తనను నేరుగా బయటికి పొమ్మనలేక.. పొగబెట్టారని జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రాహుల్ గాంధీ నాయకత్వంపైనా జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా భారత్ జోడో పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ.. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కానీ ఈ 2 రాష్ట్రాలే రాహుల్ గాంధీని ప్రధానమంత్రి కాకుండా అడ్డుకున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించి ఉంటే.. ఇవాళ భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ఉండే వారని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలోని స్వార్థ రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలే ఈ పరిస్థితికి కారణమని జీవన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి కొంతమంది నాయకులు జంప్ చేస్తారని.. కానీ తాను మాత్రం ప్రజల క్షేమం కోసమే పార్టీ మారుతున్నట్లు జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. తనను, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుంటే తాను చూస్తూ ఊరుకోలేనని తేల్చి చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చిన్నాభిన్నం అయిపోయిందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం కోసం పాకులాడే సంస్కృతి బాగా పెరిగిపోయిందని మండిపడ్డారు. మరోవైపు.. కేసీఆర్ ముందు తాను చేతులు కట్టుకుని నిలబడతానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా జీవన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తాను కేసీఆర్ ముందు ఎందుకు నిలబడతానని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడడం సరికాదని.. విభేదాల పేరుతో వ్యక్తిగతంగా కించపరచడం ఏంటని మండిపడ్డారు.

# చైనా మాటిచ్చింది

**మొదటి పేజీ తరువాయి**

ధీమా వ్యక్తం చేశారు. అయితే, తాము ఇరాన్‌కు ఎలాంటి సైనిక సహకారం అందించడం లేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ గత కొన్ని రోజులుగా పదేపదే ఖండిస్తోన్న సంగతి తెలిసిందే. చైనా చాలా కాలంగా ఇరాన్ బాలిస్టిక్ మిసైల్ ప్రోగ్రామ్‌కు మద్దతు ఇస్తోందని.. క్షిపణుల తయారీలో ఉపయోగపడే ద్వంద్వ-వినియోగ పారిశ్రామిక భాగాలను సరఫరా చేయడం ద్వారా ఇరాన్‌ను ప్రోత్సహిస్తోందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ ఆసియా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చైనా దౌత్యపరమైన జోక్యాలను ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా నాలుగు అంశాల ప్రణాళికను ప్రతిపాదించారు. ముఖ్యంగా అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతి స్తంభించిపోయిన నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా చైనా ఈ ప్రతిపాదన చేసింది. మరోవైపు, రెండో విడత చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇరాన్-అమెరికా యుద్ధం ముగింపు దశకు చేరుకుందంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇరాన్‌తో యుద్ధం ముగింపు దశకు చేరుకుందని.. త్వరలోనే ముగుస్తుందని నేను భావిస్తున్నాన్నారు. అయితే, ఇరాన్‌తో సంఘర్షణలో అమెరికా పని ఇంకా ముగియలేదు.

# ప్రజలతో ఒట్లు.. ప్రధాని బెట్టు

## 9 హామీలపై ప్రమాణం చేయించుకున్న మోదీ

బెంగళూరు: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. 'మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది' అని మోదీ వెల్లడించారు. 'నీళ్లను వృధా చేయకుండా పొదుపుగా వాడదాం. పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం. అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం. 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం. జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం. రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం. ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం. నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం. ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం' అని అక్కడున్నవారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

# అండమాన్‌లో 250 మంది గల్లంతు

**రోహింగ్యా శరణార్థుల పడవ బోల్తా**

**అధికులు బంగ్లాదేశ్ జాతీయులే**

పోర్ట్‌బ్లెయిర్: అండమాన్ సముద్రంలో భారీ నౌక ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ జాతీయులతో ప్రయాణిస్తున్న ఒక ట్రాలర్ (చేపల వేట పడవ) బోల్తా పడింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయలుదేరిన ఈ నౌకలో మహిళలు, పిల్లలతో సహా సుమారు 280 మంది ప్రయాణిస్తున్నారు. ఈ నౌక ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయలుదేరింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, అధికలోడు, బలమైన గాలులు, తుఫాను కారణంగా నౌక మునిగిపోయినట్టు తెటలుస్తోంది. ఈ విషాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్ (యూఎన్‌హెచ్‌సీఆర్) స్పందించింది. దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుంచి బయలుదేరి మలేషియాకు వెళ్తున్న ట్రాలర్, బలమైన గాలులు, సముద్రంలో అల్లకల్లోల పరిస్థితి, అధిక రద్దీ మునిగిపోయి ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపింది. రోహింగ్యాలు దీర్ఘకాలంగా నిరాశ్రయులుగా ఉండటం, దీనికి శాశ్వత పరిష్కారం లేకపోవడం వల్ల కలిగే తీవ్ర పరిణామాలకు నిదర్శనమని యూఎన్‌హెచ్‌సీఆర్ ఆవేదన వ్యక్తం చేసింది. మయన్మార్‌లో ప్రజల స్థానభ్రంశానికి గల మూలకారణాలను పరిష్కరించాల్సిన ఆవశ్యకతను, అలాగే రోహింగ్యా శరణార్థులు స్వచ్ఛందంగా, సురక్షితంగా, గౌరవప్రదంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు వీలు కల్పించే పరిస్థితులను కల్పించాల్సిన అవసరాన్ని ఈ సంఘటన గుర్తుచేసిందని పేర్కొంది. సంఘటనాస్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గాలింపు, సహాయక బృందాలు ఆ ప్రాంతంలో భారీ స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి ఆచూకీ లభించకపోవడంతో ఇంతవరకు ఎంతమంది ప్రాణాలతో బయటపడ్డారు అనే విషయంపై స్పష్టత లేదు. అందరూ మరణించి ఉంటారని భయపడుతున్నారు. అధికారులు ఇంకా మృతుల కచ్చితమైన సంఖ్యను ధృవీకరించలేదు. గంటలు గడుస్తున్నా కచ్చిమైన సమాచారం రాకపోవడంతో ఆందోళన పెరుగుతోంది.

# బీహార్ పీఠంపై కమలం!

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నుకున్నారు. రాష్ట్రంలో రాజకీయంగా అత్యంత కీలకమైన ఓబీసీ కుష్వాహ (కోయెరీ) సామాజిక వర్గానికి చెందిన ఆయన నాయకత్వానికి ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా పూర్తి మద్దతు పలికాయి. సామ్రాట్ చౌదరి రాజకీయ ప్రస్థానం గమనిస్తే.. ఆయన తొలినాళ్లలో ఆర్జేడీ, జేడీయూ పార్టీలలో పనిచేశారు. 2017లో ఆయన బీజేపీలో చేరి పార్టీ సంస్థాగత ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారు. 2023లో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి కూటమిని బలోపేతం చేశారు. బీహార్ అభివృద్ధే లక్ష్యంగా తమ నూతన ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన స్పష్టం చేశారు. తొలిసారిగా బీజేపీకి దక్కిన ఈ అవకాశాన్ని సామ్రాట్ చౌదరి ఎలా సద్వినియోగం చేసుకుంటారనే ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది.

# బయటికి వస్తే బొగ్గే!

**మొదటి పేజీ తరువాయి**

హెచ్చరించింది. ముఖ్యంగా అదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటే ప్రమాదం పొంచి ఉందని తెలిపింది. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ మూడ్రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. మరోవైపు, భారీ ఎండల నేపథ్యంలో బస్టాండ్లు, మార్కెట్లు వంటి రద్దీ ప్రదేశాలలో తాగునీరు, మజ్జిగ సౌకర్యాలు కల్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు పని నుంచి మినహాయింపునిస్తూ నిర్ణయం తీసుకుంది.

# ఇది యూపారం!

**మొదటి పేజీ తరువాయి**

ఇందులో భారత్‌కు భారీ వాణిజ్య లోటు ఉంది. చైనా నుంచి యంత్రాలు, రసాయనాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులను భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. గత 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు వరుసగా నాలుగేళ్ల పాటు అమెరికానే భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. కానీ, గతేడాదిలో చైనాకు భారత ఎగుమతులు 36.66 శాతం పెరిగి 19.47 బిలియన్ డాలర్ల(1.81 లక్షల కోట్ల)కు చేరుకోగా, దిగుమతులు 16 శాతం పెరిగి 131.63 బిలియన్ డాలర్ల(12.27 లక్షల కోట్ల)కు చేరాయి. 2024-25లో 99.2 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు, 2025-26 నాటికి చారిత్రాత్మక గరిష్ఠం 112.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. మరోవైపు, అమెరికాకు మన ఎగుమతులు 0.92 పెరిగి 87.3 బిలియన్ డాలర్లకు, దిగుమౌలు 15.95 శాతం పెరిగి 52.9 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 40.89 బిలియన్ డాలర్ల నుంచి 34.4 బిలియన్ డాలర్లకు తగ్గిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. చైనా నుంచి ఎలక్ట్రికల్ మిషనరీ, న్యూక్లియర్ రియాక్టర్లు, ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్ వంటి వస్తువులను భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది.

## సరిహద్దులో 800 మంది ఉగ్రవాదులు

**మొదటి పేజీ తరువాయి**

బుధవారం హెచ్చరించాయి. ఉగ్రవాదులను చొప్పించడం కోసం పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉంది. అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా భావించి పాకిస్థాన్ ఈ కుట్రకు పాల్పడుతోందని నిఘా విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం ఉన్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దాంతో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున గ్రూపులుగా ఉగ్రవాదులను పంపి భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని పాకిస్థాన్ చూస్తోంది. ఇలాచేస్తే కొందరైనా భారత్‌లోకి చొరబడగలరని పాకిస్థాన్ భావిస్తోంది. గత ఏడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది.

# ప్రతి హాస్పిటల్‌లో ఓ బృందం

**వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స.. అధికారులకు మంత్రి దామోదర ఆదేశం.. వేసవి నేపథ్యంలో హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు**



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో తాగు నీటి సౌకర్యం, అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు, వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంత్రి బుధవారం సమీక్ష చేశారు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎండా కాలం నేపథ్యంలో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు తీసుకుంటున్న చర్యలను, హాస్పిటళ్లలో అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల కోసం చేసిన ఏర్పాట్లను అధికారులు మంత్రికి వివరించారు. వడ దెబ్బ బాధితులకు తక్షణమే చికిత్స అందించేందుకు అన్ని హాస్పిటల్స్‌లో ఇప్పటికే ఏర్పాట్లు చేశామని, అవసరమైన మెడిసిన్, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్లు, వారి అటెండెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పెద్ద హాస్పిటల్స్‌లో ప్రతి బ్లాక్‌లో, ప్రతి ఫ్లోర్‌లో డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ ఆవరణలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నదని, ఈ నేపథ్యంలో అవుట్ పేషెంట్లకు, ఇన్‌పేషెంట్లకు, హాస్పిటల్ సిబ్బందికి, డాక్టర్లకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన చోట ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐసీయూలు, అవసరమైన ఇతర వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు రిపేర్ ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలన్నారు.

### ఎమర్జెన్సీలో డెడికేటెడ్ టీమ్ ఉండాలి

వడ దెబ్బతో అనారోగ్యం పాలైన వారికి చికిత్స అందించేందుకు ఒక బృందాన్ని హాస్పిటల్ ఎమర్జన్సీ ఏరియాలో సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించేలా ఈ బృందంలోని సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన మెడిసిన్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

### జనరేటర్లు సిద్ధంగా ఉండాలి

వేసవి కాలంలో గాలిదుమారాలు, ఈదురు గాలులు, అకాల వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుందని, ఇలాంటి సమయాల్లో పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వెంటనే జనరేటర్లు ఆన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు అన్ని హాస్పిటల్స్‌లో జనరేటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అయితే, వెంటనే వాటి పనితీరును పరిశీలించాలని, అవసరమైన చోట రిపేర్లు, మెయింటనన్స్ చేయించాలని మంత్రి ఆదేశించారు.

### అగ్ని ప్రమాదాల ముప్పు

వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే ముప్పు ఎక్కువగా ఉంటుందని అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. అన్ని హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, ఈ నేపథ్యంలో అన్ని హాస్పిటల్స్‌లో పవర్ కేబుల్స్‌ను వెంటనే చెక్ చేయించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట పాత వైర్ల స్థానంలో, కొత్త వైరింగ్ చేయించాలని సూచించారు. హాస్పిటళ్ల లోపల, బయట గుట్కా నమలడం, స్మోకింగ్, డ్రింకింగ్ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని మంత్రి ఆదేశించారు. అన్ని హాస్పిటల్స్‌లో ఫైర్ అలార్మ్, స్మోక్ డిటెక్టర్స్ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. మంటలను ఆర్పే యంత్రాలు సరిపడా ఉన్నాయో, లేవో? చూడాలని.. వాటి ఎక్స్‌పైరీ గడువు తేదీలను సైతం చెక్ చేయాలని ఆదేశించారు. మంటలు ఆర్పే యంత్రాల వినియోగంపై హాస్పిటల్ సిబ్బంది, సెక్యూరిటీకి మరోసారి శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ, షార్ట్ సర్క్యూట్‌కు సంబంధించి చేయాల్సిన, చేయకూడని పనుల గురించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమీపంలోని ఫైర్ స్టేషన్ అధికారులతో, హాస్పిటల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని, ఫైర్ సేఫ్టీ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు.



## అవగాహనతోనే నివారణ సాధ్యం

వడ దెబ్బ నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై మంత్రి ఆరా తీశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హాస్పిటల్స్, బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాలను ఎంపిక చేసుకుని అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన కంటెంట్‌ను రూపొందించి, ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి సంవత్సరం ఉపాధి హామి కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. పట్టణాల్లో ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, ఇతర గిగ్ వర్కర్లకు వడ దెబ్బపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

### బాధితులకు అండగా ఉండాలి

ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు మంత్రి పిలుపునిచ్చారు. పిల్లలు, వృద్దులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లినప్పుడు ఎండదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగు నీరు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, ఎక్కువసేపు ఎండలో ఉండకూడదని సూచించారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది కలిగితే తక్షణమే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలన్నారు. తమ చుట్టూ ఉన్నవారిలో ఎవరికైనా వడ దెబ్బ తగిలితే, వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు బాధితున్ని తరలించాలని, 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయాలని మంత్రి ప్రజలను కోరారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## డీలిమిటేషన్ బిల్లు పరిశీలించాక నిర్ణయం

**మహిళా బిల్లుకు మద్దతిస్తాం: కేసీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): భారత ప్రభుత్వం గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# 20న కాళేశ్వరానికి రేవంత్

**కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పరిశీలన**



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. విచారణ జరిపి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించింది. అయితే ఈ కమిషన్ ఏర్పాటు, అది సమర్పించిన నివేదికపై బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా.. దానికి సంబంధించిన తుది తీర్పు త్వరలోనే వెల్లడి కానుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెల 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరంలో పర్యటించనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని స్వయంగా పరిశీలించనున్నారు. గతంలో కుంగిపోయిన ఈ మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన.. పియర్లను పరిశీలించి.. పునరుద్ధరణ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. అదే సమయంలో కాళేశ్వరం పరిధిలోని గోదావరి నది వద్ద నిర్వహించినున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేయనున్నారు. ఇక ఈ కాళేశ్వరం పర్యటన ముగింపులో భాగంగా అక్కడ ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు.. కాళేశ్వరం ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ఆ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటనలు చేసే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక సీఎం రేవంత్ కాళేశ్వరం పర్యటనకు సంబంధించి.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రంగంలోకి దిగారు. సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి శ్రీధర్ బాబు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులతో కలిసి సభా ఏర్పాట్లు, భద్రతపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## కిషన్ రెడ్డి వ్యాఖ్యలు అహంకారపూరితం

**కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మండిపాటు**


హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'నోరు మూసుకుని కూర్చో' అనడం కిషన్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి పట్ల కేంద్ర మంత్రికి కనీస గౌరవం లేదా? అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లతో పాటు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న రేవంత్ రెడ్డి సూచనలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఇష్టానుసారంగా నియోజకవర్గాల చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని, పార్లమెంట్‌లో దీనిపై తమ గళం గట్టిగా వినిపిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం తన మొండి వైఖరిని కొనసాగిస్తే తెలంగాణ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని మల్లు రవి హెచ్చరించారు. దేశం కోసం ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని, దేశం పట్ల తమ పార్టీకి ఉన్న నిబద్ధతను ఎవరూ శంకించలేరన్నారు.

## హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్

**ఫ్యూచర్ సిటీలో శాశ్వత ప్రాంగణం**

**తాత్కాలికంగా లేక్ వ్యూ గెస్ట్ హౌస్**

**2027-28 నుంచి కోర్సులు ప్రారంభం**




హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' తమ తొలి భారతీయ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఐటీ, బయోటెక్ రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నగర కీర్తి కిరీటంలో ఈ పరిణామం మరో కలికితురాయిగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలోని ఎడ్యుకేషన్ జోన్‌లో ఈ విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీని నిర్మాణం పూర్తయ్యే వరకు, నగరం నడిబొడ్డున ఉన్న లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌ను తాత్కాలిక ప్రాంగణంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. 2027-28 విద్యా సంవత్సరం నాటికి కోర్సులను ప్రారంభించే లక్ష్యంతో వర్సిటీ ప్రతినిధులు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు (యూజీసీ) దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు. 1836లో స్థాపించిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూకేలోని అత్యంత పురాతన ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఒకటి. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్-500లోపు ఉన్న విదేశీ వర్సిటీలనే భారత్‌లో అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు ఇది పూర్తిస్థాయిలో అనుగుణంగా ఉంది. లండన్ బిజినెస్ స్కూల్, కింగ్స్ కాలేజ్ వంటి 17 ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సమాఖ్యగా ఇది పనిచేస్తోంది. తెలంగాణను అన్ని రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 13 ప్రతిష్ఠాత్మక యూకే పాఠశాలల ప్రతినిధులు కూడా హైదరాబాద్‌లో తమ శాఖల ఏర్పాటుకు ఆసక్తి చూపారు. ఈ పరిణామంతో స్థానిక విద్యార్థులు తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ స్థాయి విద్యను పొందడంతో పాటు, నగరంలోని ఐటీ, బయోటెక్ సంస్థలకు నైపుణ్య మానవ వనరులు మరింతగా అందుబాటులోకి వస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## కేసీఆర్ మరో ఉద్యమం

**దక్షిణాదికి అన్యాయం జరిగితే ఊరుకోం.. బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక**

**మహిళా బిల్లుకు మద్దతిస్తాం: కేటీఆర్**



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలకు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఈ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

## భూసేకరణ ఆపకపోతే ఉద్యమమే

**వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన**



వికారాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు.



## కొండగట్టు నిత్యాన్నదాన సత్రానికి విరాళం

మల్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన అమరగొండ కిషన్ దంపతులు కొండగట్టు ఆంజనేయస్వామి నిత్యాన్నదాన సత్రానికి భారీ విరాళం అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం.. ఉచిత అన్నదానం కోసం రూ.80,000 చెక్కును ఆలయ ఏఈవో హరిహరనాథ్2కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్ పాల్గొన్నారు.

## కేసీఆర్ సభను అడ్డుకుంటే..జాగ్రత్త!

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హెచ్చరిక**



జగిత్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): కేసీఆర్ బహిరంగ సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆరోపించారు. జగిత్యాల పట్టణ శివారులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 20న నిర్వహించనున్న సభకు కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల నుంచి కార్యకర్తలు రాకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను అకస్మాత్తుగా ప్రారంభించారని విమర్శించారు. కాంట్రాక్టర్‌ను పనులు వాయిదా వేయాలని కోరినా పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సభను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తే సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## గుడి దారికి భూమి విరాళం

ఎండపల్లి, ఏప్రిల్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూర్ గ్రామంలో పోచమ్మ గుడి దారికి అవసరమైన భూమిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు స్వంతంగా కొనుగోలు చేసి విరాళంగా అందించారు. ఇందుకోసం భూ యజమాని సుంకిశేల శ్రీనివాసరావుకు రూ.18 లక్షల చెక్కును అందజేశారు. గ్రామ ప్రజలకు సౌకర్యంగా గుడికి వెళ్లే మార్గం కల్పించాలనే ఉద్దేశంతో చేసిన ఈ సేవను గ్రామస్థులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## సీఎం చేతుల మీదుగా 'గల్ఫ్ గాయం' పుస్తకావిష్కరణ

జగిత్యాల,హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): గల్ఫ్ దేశాల్లో పని చేసే కార్మికుల సమస్యలను ప్రతిబింబిస్తూ రాసిన గల్ఫ్ గాయం పుస్తకాన్ని మంగళవారం రాత్రి సీఎం రేవంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఖుతుబోద్దీన్, అజీమ్ కుటుంబాలకు ఐజేయూ పరామర్శ

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ జగిత్యాల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీమ్ తల్లి మృతి పట్ల ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి వెంట ఐజేయూ జిల్లా జనరల్ సెక్రటరీ సంపూర్ణచారి, క్యాషియర్ వేణుగోపాల్, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బూరం సంజీవ్, సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, మహేందర్, గణేష్, కౌన్సిలర్ మసూల ప్రవీణ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

# చిన్న వయసులోనే ట్రాఫిక్ రూల్స్ తెలియాలి

**అరైవ్ అలైవ్ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అలవరచుకోవడం ద్వారా బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చనే లక్ష్యంతో జగిత్యాల జిల్లాలో ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం ప్రభావవంతంగా జరుగుతోంది. బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా తల్లిదండ్రుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు "డియర్ పేరెంట్స్, ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్" అనే సందేశంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు హెల్మెట్ కొనివ్వాలని లేఖలు రాయడం ద్వారా కుటుంబ స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించవచ్చని సూచించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, స్కూల్‌కు వెళ్లే సమయంలో ఇరుపక్కల చూసుకుని జాగ్రత్తగా దాటడం, స్కూల్ బస్సులో ఎక్కడం, దిగడం సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం వంటి అలవాట్లు నిత్యజీవితంలో పాటించాలని సూచించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాల పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు: విద్యాసాగర్ రావు



జగిత్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): ఈ నెల 20న జరిగే కేసీఆర్ బహిరంగసభను విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపు రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభను ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించే వేదికగా మార్చాలని తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ లో చేరబోతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తూ 1 విస్తృత ప్రచారం చేయాలని, యువతను పెద్ద ఎత్తున సభకు తీసుకురావాలని నాయకులు కోరారు. సభ విజయవంతం కోసం మండల, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని, ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని తెలిపారు. కార్యకర్తలంతా ఐక్యతతో కృషి చేసి సభను ఘన విజయంగా నిలపాలని, కార్యక్రమం నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. సభను చారిత్రాత్మక విజయంగా నిలిపి పార్టీకి మరింత బలం చేకూర్చాలని ఆకాంక్షించారు.

# మూడేళ్లలో వైసీపీ సర్కారు

**దేవుడు అన్నీ చూస్తున్నాడు**

**ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఫైర్**

నెల్లూరు, ఏప్రిల్ 15 (ఈవార్తలు): ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని, దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు.



## జగిత్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

**సీడీఎంఏతో ఎమ్మెల్యే సంజయ్ భేటీ**

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ మున్సిపల్ అభివృద్ధి విషయంలో సీడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీదేవిని బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూఐడిఎఫ్ ఫండ్స్ విధి విధానాలు, జాప్యాలు గురించి, జగిత్యాల మున్సిపల్ లో సిబ్బంది కోరత ఉందని తెలపగా సానుకూలంగా స్పందించిన శ్రీదేవి త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి జగిత్యాలలో జరుగుతున్న వివిధ రాజకీయ పరిణామాల గురించి కూడా చర్చించి, జగిత్యాలలో వివిధ అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని కోరగా వెంటనే స్పందించిన సీఎం.. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఏపీ ప్రయోజనాలకు డీలిమిటేషన్ దెబ్బ

**చంద్రబాబుకు షర్మిల బహిరంగ లేఖ**

విజయవాడ, ఏప్రిల్ 15 (ఈవార్తలు): నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మూడు పేజీల బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2011 జనాభా లెక్కల ఆధారిత పునర్విభజన ప్రక్రియ రాష్ట్ర ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రతిపాదనల వల్ల ఆంధ్రప్రదేశ్ తన రాజకీయ ప్రభావాన్ని కోల్పోవడమే కాకుండా, వేల కోట్ల రూపాయల ఆర్థిక అవకాశాలను కూడా నష్టపోతుందని షర్మిల హెచ్చరించారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా ఏపీకి అన్యాయం చేసే ఈ డీలిమిటేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బహిరంగంగా, నిస్సంకోచంగా వ్యతిరేకించాలని ఆమె కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పార్టీలకతీతంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని షర్మిల కోరారు. డీలిమిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని కేంద్రానికి పంపాలని సూచించారు.

## ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల

**12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!**

విజయవాడ, ఏప్రిల్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. గడిచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. ఈ ఏడాది సుమారు 10.50 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారని లోకేశ్ తెలిపారు. గత 12 ఏళ్లలో ఏన్నడూ లేనంతగా ఈ ఏడాది అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫస్టియర్లో 77 శాతం మంది విద్యార్థులు (3,61,526) పాసవ్వగా.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థులు (3,59,816) ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఫస్టియర్లో బాలురు 72 శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్లో బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం పాసయ్యారు. ఒకేషనల్ కోర్సులో ఫస్టియర్ లో 61%, సెకండియర్ లో 74% మంది పాసయ్యారు.




జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో నిర్మించ తలపెట్టిన పద్మశాలి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంకు వినతిపత్రం అందజేసిన మల్యాల మండల పద్మశాలి సంఘ నేతలు ముల్క మల్లారెడ్డి, పెంట సుధాకర్ తదితరులు



## హోటళ్లపై దాడిలో 24 సిలిండర్లు స్వాధీనం

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఈవార్తలు): జగిత్యాలలో పలు హోటళ్లలో బుధవారం సివిల్ సప్లై అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ హోటల్లలో అక్రమంగా వాడుతున్న 24 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా వంట గ్యాస్ అక్రమ వినియోగంపై సివిల్ సప్లై అధికారులు దాడులు నిరంతరం కొనసాగుతాయని ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధికారులు తెలిపారు.



# బ్రెయిన్ వాష్ చేసి వేధించేవారు!

## దేవుడా... నేను బతికిపోయాను.. నాసిక్ టీసీఎస్ పరిస్థితిపై ఓ మహిళ

న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులు, మానసిక హింస, మత మార్పిడి యత్నాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చిన ఘటన కార్పొరేట్ ప్రపంచంలో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో ఇప్పటికే హెచ్ఆర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరేళ్లుగా టీసీఎస్‌లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని జాతీయ మీడియాతో మాట్లాడుతూ తాను ఎదుర్కొన్న భయానక అనుభవాలను పంచుకున్నారు. ఆమె కథనం ప్రకారం, నాసిక్ ఆఫీసుకు బదిలీపై వచ్చిన తర్వాత, ఆమెను ప్రధాన భవనానికి దూరంగా ఉన్న టెర్రస్‌పై ఒంటరిగా పనిచేయమని ఆదేశించారు. టాయిలెట్ వంటి అవసరాల కోసం కిందకు వచ్చిన ప్రతిసారీ, 'సెక్యూరిటీ' పేరుతో కొందరు ఆమె ఫోన్, బ్యాగ్ వంటి వ్యక్తిగత వస్తువులను లాక్కునేవారు. తద్వారా ఆమెను బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా పూర్తిగా ఏకాకిని చేశారు. “20 నుంచి 25 ఏళ్ల యువతులను సులభ లక్ష్యాలుగా చేసుకుని బ్రెయిన్‌వాష్ చేసి, వారిని వేధించేవారు. ఫిర్యాదు చేస్తే హెచ్ఆర్‌కు వెళ్ళమంటారు, కానీ ఇక్కడ హెచ్ఆర్ కూడా వారికి భయపడే పరిస్థితి. దేవుడి దయవల్ల నేను బతికి బయటపడ్డాను, లేదంటే నా గతి కూడా ఏమయ్యేదో” అని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపుల పర్వం 2021 నుంచే కొనసాగుతోందని మరో కాంట్రాక్టు ఉద్యోగి ఆరోపించారు. “హిందూ అమ్మాయిలను ప్రేమ పేరుతో వల వేయండి, పెళ్లి చేసుకోండి, మతం మార్చండి అని ప్రోత్సహించేవారు. ఇందుకు డబ్బు కూడా ఆశ చూపేవారు. హెచ్ఆర్ మేనేజర్‌కు కూడా ఈ వ్యవహారంలో ఫండ్స్ అందేవి” అని ఆయన తెలిపారు. ఈ కేసులో ఫిబ్రవరి 2022 నుంచి మార్చి 2026 మధ్య కాలంలో ఎనిమిది మంది మహిళా ఉద్యోగులు తొమ్మిది వేర్వేరు ఫిర్యాదులు చేశారు. మానసిక, లైంగిక వేధింపులు, పెళ్లి పేరుతో శారీరక సంబంధాలు, అసభ్యంగా తాకడం, మతాన్ని కించపరచడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఇందులో ఉన్నాయి. ఒక పురుష ఉద్యోగిని బలవంతంగా నమాజ్ చేయించి, అతని మతాన్ని అవమానించినట్లు కూడా ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై నాసిక్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఇప్పటికే డానిష్ షేక్, తౌసీఫ్ అట్టార్, రజా మేమన్, షారుఖ్ ఖురేషి, షఫీ షేక్, అసిఫ్ అఫ్తాబ్ అన్సారీలతో పాటు హెచ్ఆర్ మేనేజర్ నిదా ఖాన్‌ను




అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారందరినీ టీసీఎస్ సస్పెండ్ చేసి, నాసిక్ ఆఫీసు ఉద్యోగులందరికీ వర్క్ ఫ్రమ్ హోమ్ ప్రకటించింది. టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ ఈ ఆరోపణలను “తీవ్రమైనవి, బాధాకరమైనవి” అని పేర్కొన్నారు. వేధింపుల విషయంలో తమ సంస్థ జీరో టాలరెన్స్ పాటిస్తుందని, విచారణకు పూర్తిగా సహకరిస్తామని టీసీఎస్ ప్రకటించింది. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అరతి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అంతర్గత విచారణకు ఆదేశించింది. కాగా, ఈ కేసుతో సంబంధం ఉందని భావిస్తున్న మరో మహిళా ఉద్యోగి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. అరెస్టయిన రజా మేమన్ తల్లి మాత్రం తన కొడుకు నిర్దోషి అని వాదిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని కార్యాలయాల్లోని మహిళలు ఇలాంటి 'డార్క్ కల్చర్'కు వ్యతిరేకంగా గళం విప్పాలని బాధితురాలు పిలుపునిచ్చారు.

# డీలిమిటేషన్ దక్షిణాదికి పెను ముప్పు

**వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలి: విజయ్**

చెన్నై: పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లుపై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ స్పందించారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026ను కేంద్రం చర్చకు తీసుకురావచ్చని విజయ్ పేర్కొన్నారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును స్వాగతిస్తున్నామని, అయితే దానికంటే ముందు డీలిమిటేషన్ బిల్లుకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. విజయ్ తన ప్రకటనలో వివరిస్తూ.. “జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను పునర్విభజిస్తే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం



పార్లమెంటులో గణనీయంగా తగ్గిపోతుంది. దీనికి విరుద్ధంగా, అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరుగుతుంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల గొంతు బలహీనపడి, భాష, సంస్కృతి, రాష్ట్రాల హక్కులకు సంబంధించిన అంశాలపై తగినంత శ్రద్ధ లభించకపోవచ్చు” అని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు ప్రజల ఆకాంక్షలు, సమస్యలు పార్లమెంటులో సరిగ్గా వినిపించని దుస్థితి ఏర్పడుతుందని, ఇది వివక్షాపూరిత చర్యేనని ఆయన అభివర్ణించారు. ఈ సవరణ కేవలం రాజకీయ ప్రాతినిధ్యానికే కాకుండా, కేంద్ర నిధుల కేటాయింపులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని విజయ్ హెచ్చరించారు. ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రానికి సరైన ప్రాజెక్టులు, నిధులు కేటాయించడం లేదని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో జనాభా ఆధారంగా సీట్లను, నిధులను పంపిణీ చేస్తే దక్షిణాది రాష్ట్రాలు మరింత ఆర్థికంగా నష్టపోతాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను పాటించిన రాష్ట్రాలను శిక్షించి, పాటించని రాష్ట్రాలకు బహుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం తన ప్రతిపాదనను పునఃపరిశీలించి, ఈ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని విజయ్ డిమాండ్ చేశారు.

# ఉదయనిధి ఆస్తులపై ఐటీ విచారణ

**మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశం**

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ డీఎంకే కీలక నేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లోని ఆస్తుల వివరాల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలపై ప్రాథమిక విచారణ జరపాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 23న పోలింగ్ జరగనున్నందున, ఓటర్లకు అభ్యర్థుల ఆర్థిక విషయాలపై కచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 20వ తేదీలోగా నివేదిక సమర్పించాలని ఐటీ శాఖ డైరెక్టర్ జనరల్‌కు గడువు విధించింది. ఉదయనిధి స్టాలిన్ పోటీ చేస్తున్న చేపాక్–తిరువల్లికేణి నియోజకవర్గానికి చెందిన ఆర్. కుమార్వేల్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌తో పోలిస్తే, ప్రస్తుత ఎన్నికల కోసం సమర్పించిన అఫిడవిట్‌లో అనేక తేడాలు ఉన్నాయని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వి.



రాఘవాచారి కోర్టుకు వివరించారు. గతంలో ప్రకటించిన కొన్ని ఆస్తులు తాజా అఫిడవిట్‌లో కనిపించకపోవడం, అప్పుల లెక్కల్లో మార్పులు, ఆర్థిక లావాదేవీల వివరాల్లో పొంతన లేకపోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటివి ఎన్నికల పారదర్శకతపై తీవ్ర ప్రభావం చూపుతాయని వాదించారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం (ఈసీఐ) తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాలన్ వాదనలు వినిపిస్తూ, అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను నిజాయతీగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. అయితే, నామినేషన్ల స్క్రూటినీ సమయంలో ప్రతి అఫిడవిట్‌లోని నిజానిజాలను స్వయంగా నిర్ధారించే అధికారం రిటర్నింగ్ అధికారులకు ఉండదని, వారు కేవలం పరిశీలకులు మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 125ఏ ప్రకారం తప్పుడు వివరాలు ఇస్తే శిక్షలు ఉంటాయని, కానీ ఆ ప్రక్రియ ఎన్నికల తర్వాతే జరుగుతుందని వివరించారు. అయితే, తమ ఉద్దేశం క్రిమినల్ చర్యలు తీసుకోవడం కాదని, పోలింగ్‌కు ముందే ఓటర్లకు వాస్తవాలు తెలియజేయడమేనని పిటిషనర్ తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ జి. అరుణ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం, ఐటీ శాఖ నివేదిక కోసం కేసు విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది.

## కేంద్ర బలగాలు పారిపోయాయి

**కారు తనిఖీలపై మమత వ్యంగం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేంద్ర బలగాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం కోల్‌కతా విమానాశ్రయానికి వెళుతుండగా, తన కారును తనిఖీ చేసేందుకు కేంద్ర బలగాలు ప్రయత్నించాయని ఆమె ఆరోపించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని ఇస్లాంపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత ఈ విషయంపై మాట్లాడారు. “ఈరోజు దం దం విమానాశ్రయంలో నా కారును తనిఖీ చేయడానికి కేంద్ర బలగాలు వచ్చాయి. నేను తనిఖీ చేసుకోమని చెప్పాను. కానీ వారు భయంతో పారిపోయారు. నా కారును తనిఖీ చేస్తే నాకు సంతోషమే. నేను దొంగను కాదు, దోపిడీదారును కాదు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జీతంగా తీసుకోను” అని ఆమె అన్నారు. అంతేకాకుండా, “టీఎంసీ నేతల కార్లనే ఎందుకు తనిఖీ చేస్తున్నారు? ప్రధాని, హోంమంత్రి, బీజేపీ నేతల వాహనాలను ఎందుకు తనిఖీ చేయరు? ఈ ఎన్నికలు ఎందుకు ఇలా జరుగుతున్నాయి?” అని ఆమె ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, వారి కుటుంబ సభ్యుల వాహనాలను తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని టీఎంసీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం గమనార్హం. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య వాహనాలను కూడా తనిఖీ చేయాలని ఆదేశాల్లో ఉన్నట్లు టీఎంసీ మంగళవారం ఆరోపించింది. ఈ సందర్భంగా మమత మరిన్ని సంచలన ఆరోపణలు చేశారు. “కేంద్ర మంత్రులు డబ్బులు తీసుకొస్తున్నారు. కేంద్ర బలగాల వాహనాల్లో ఏం వస్తుందో నాకు తెలుసు” అని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి కార్డులు పంచుతూ ఆర్థిక హామీలు ఇస్తున్నారని, ఇది ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆమె విమర్శించారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

## సీబీఎస్ఈ టెన్త్ ఫలితాలు విడుదల

**గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత**

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10వ తరగతి పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 93.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాది (93.66 శాతం) ఉత్తీర్ణత శాతంతో పోలిస్తే ఇది స్వల్పంగా ఎక్కువ కావడం గమనార్హం. బుధవారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేసిన ఈ ఫలితాలు బోర్డు అధికారిక వెబ్‌సైట్లతో పాటు డిజీలాకర్, ఉమంగ్ యాప్‌లలో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పరీక్షల కోసం మొత్తం 24,83,479 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 24,71,777 మంది హాజరయ్యారు. వీరిలో 23,16,008 మంది ఉత్తీర్ణత సాధించినట్లు బోర్డు వెల్లడించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో 55,368 మంది విద్యార్థులు (2.24 శాతం) 95 శాతానికి పైగా మార్కులు సాధించారు.

## నాన్-ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు వచ్చేస్తోంది

**చెన్నై ఐసీఎఫ్‌లో తయారీ.. త్వరలో ముంబై ట్రాక్‌లపై ట్రయల్స్**

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబై లోకల్ రైళ్లలో ప్రయాణించే లక్షలాది మందికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా నాన్–ఏసీ, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఏసీ లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఏసీ రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఏసీ లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది. ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్–బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్ఈడీ లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి. ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఏసీ లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్ విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

## మా అత్తామామ గొప్పోళ్లు

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రశంసలు**



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భారతీయ అత్తింటి కుటుంబంపై ప్రశంసల వర్షం కురిపించారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అమెరికాను సుసంపన్నం చేయడంలో వలసదారులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. ముఖ్యంగా భారత్ నుండి వచ్చి ఇక్కడి పౌరసత్వం పొందిన తన మామగారు, అమెరికా ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, ఆయనను చూసి తాను గర్విస్తున్నానని పేర్కొన్నారు. వలసదారులు ఈ దేశానికి చేస్తున్న సేవలను ప్రశంసిస్తూనే, ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠినమైన నియంత్రణ ఉండాలనే అభిప్రాయాన్ని ఆయన సమర్థించారు. ఈ సందర్భంగా హెచ్–1బీ వీసా వ్యవస్థలో జరుగుతున్న మోసాల గురించి వాన్స్ ప్రస్తావించారు. గ్రీన్‌కార్డుల కోసం భారత సంతతి వ్యక్తులు ఎదురుచూస్తున్న సుదీర్ఘ నిరీక్షణపై స్పందిస్తూ... అమెరికా పౌరసత్వం అంటే దేశ ప్రయోజనాలకు కట్టుబడి ఉండటమేనని స్పష్టం చేశారు. జేడీ వాన్స్ భార్య ఉషా చిలుకూరి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాకు చెందిన తెలుగు కుటుంబానికి చెందినవారన్న సంగతి తెలిసిందే. ఆమె తల్లిదండ్రులు 1980ల్లోనే అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. మరోవైపు, ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల పరిష్కారంపై కూడా వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న అపనమ్మకం రాత్రికి రాత్రే తొలగిపోదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఇరాన్ ప్రతినిధులు ఒప్పందం కోసం ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా మరోసారి శాంతి చర్చలు జరగనున్నాయని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో, ఈ నెల 21న ముగియనున్న కాల్పుల విరమణ గడువులోపు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుందని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది.



## అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకున్న ఇరాన్ నౌకలు!

టెహ్రాన్: ఇరాన్‌పై అమెరికా విధించిన కఠినమైన నౌకా దిగ్బంధనాన్ని ఛేదించుకుని ఇరాన్ నౌకలు చాకచక్యంగా ముందుకు సాగుతున్నాయి. హార్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక నిఘా కళ్లుగప్పి, తమ గమ్యస్థాన వివరాలను మార్చివేసి కనీసం రెండు నౌకలు విజయవంతంగా ఇరాన్ పోర్టుల వైపు ప్రయాణించాయి. ఈ పరిణామం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం ఈ విషయాన్ని బ్రిటన్‌కు చెందిన ప్రముఖ షిప్పింగ్ మీడియా 'లాయిడ్స్ లిస్ట్' వెల్లడించింది. అమెరికా దిగ్బంధనం అమల్లోకి వచ్చాక, ఇరాన్‌కు చెందిన రెండు కంటైనర్ నౌకలు తమ ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఏఐఎస్)లో గమ్యస్థానాన్ని మార్చేశాయి. తొలుత 'బందర్ అబ్బాస్' పోర్టుగా ఉన్న వివరాలను, మరింత సాధారణంగా ఉండే 'పీజీ పోర్ట్స్' (పర్షియన్ గల్ఫ్ పోర్టులు) అని మార్చడం ద్వారా అమెరికా దళాలను ఏమార్చాయి. జలసంధిని దాటిన తర్వాత, మంగళవారం అవి తిరిగి బందర్ అబ్బాస్ పోర్టు వైపు తమ ప్రయాణాన్ని కొనసాగించాయి. ఇరాన్ అనుసరిస్తున్న ఈ ఎత్తుగడలు అమెరికా నిఘా వ్యవస్థకు సవాలుగా మారాయని, అనుమానిత నౌకలను గుర్తించేందుకు అదనపు వనరులు అవసరమవుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ దిగ్బంధనాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. 10,000 మందికి పైగా సైనికులు, డజనుకు పైగా యుద్ధనౌకలు, డజన్ల కొద్దీ విమానాలతో ఇరాన్ పోర్టులను దిగ్బంధించినట్లు ప్రకటించింది. తొలి 24 గంటల్లో ఏ నౌక తమ వలయాన్ని దాటలేదని, ఆరు వాణిజ్య నౌకలను వెనక్కి పంపించామని 'ఎక్స్'లో పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. “హెచ్చరిక: మా దిగ్బంధనం సమీపంలోకి ఏ ఇరాన్ నౌక వచ్చినా, సముద్రంలో డ్రగ్ డీలర్ల పడవలపై ప్రయోగించే వ్యవస్థతోనే వాటిని తక్షణమే ధ్వంసం చేస్తాం” అని తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో సంచలన పోస్ట్ చేశారు. ఈ ఘర్షణ వాతావరణం కారణంగా హార్మూజ్ జలసంధిలో నౌకల రద్దీ గణనీయంగా పడిపోయింది. సంఘర్షణకు ముందు రోజు 100కి పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య 10 శాతం కంటే తక్కువ స్థాయికి చేరింది. ఈ పరిణామాలు ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## గురుగ్రామ్ భూ దందా.. రాబర్ట్ వాద్రాకు నోటీసులు

**మే 16న కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశం**

గురుగ్రామ్: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గుర్గావ్‌లోని షికోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనకు, మరో ఎనిమిది మందికి ప్రత్యేక కోర్టు బుధవారం సమన్లు జారీ చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును (ఛార్జ్‌షీట్) పరిగణనలోకి తీసుకున్న రౌస్ అవెన్యూ కోర్టు, మే 16న తమ ముందు హాజరుకావాలని నిందితులందరినీ ఆదేశించింది. 2008 నాటి ఈ భూ ఒప్పందం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏప్రిల్ 4న ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, ఛార్జ్‌షీట్‌ను విచారణకు స్వీకరించాలా వద్దా అనే అంశంపై తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకుంటూ నిందితులకు సమన్లు జారీ చేసింది. తనపై ఎలాంటి మనీలాండరింగ్ కేసు నమోదు కాలేదని, ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవద్దని వాద్రా తరఫు న్యాయవాది గతంలో వాదించారు. హర్యానాలోని షికోపూర్ గ్రామంలో 3.53 ఎకరాల భూమిని మోసపూరితంగా కొనుగోలు చేసి, దాని ద్వారా వాద్రా నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించారని ఈడీ ఆరోపిస్తోంది. వాద్రాకు చెందిన స్కైలైట్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ, అతి తక్కువ మూలధనంతో 2008లో రూ. 7.50 కోట్లకు ఈ భూమిని కొనుగోలు చేసిందని ఈడీ పేర్కొంది. ఈ లావాదేవీలో అసలు చెల్లింపులే జరగలేదని, నకిలీ చెక్కు వివరాలను దస్తావేజుల్లో పొందుపరిచారని ఆరోపించింది. ఈ కేసులో మొత్తం రూ. 58 కోట్లను నేరపూరిత ఆదాయంగా గుర్తించినట్లు ఈడీ తెలిపింది. ఇందులో భాగంగా వాద్రా, ఆయన కంపెనీలకు చెందిన రూ. 38.69 కోట్ల విలువైన 43 స్థిరాస్తులను ఇప్పటికే తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ కేసులో నిందితులకు గరిష్ఠంగా ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించాలని, జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఈడీ కోర్టును అభ్యర్థించింది. 2012లో సీనియర్ ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా ఈ భూ ఒప్పందాన్ని రద్దు చేయడం అప్పట్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

## మా గళాన్ని వినాలి కేంద్రంపై స్టాలిన్ తీవ్ర ఆగ్రహం

చెన్నై: నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు అభిప్రాయాలను పట్టించుకోకపోతే బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై ఆయన 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. పునర్విభజన పేరుతో కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. దేశాభివృద్ధికి కృషి చేసినందుకు గాను కేంద్రం దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తుందా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో రేపు కేంద్రం ప్రవేశపెట్టాలని చూస్తున్న డీలిమిటేషన్ సవరణ బిల్లుపై దక్షిణాదికి చెందిన వారు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టాలని చూస్తోన్న బిల్లును వ్యతిరేకిస్తూ రేపు తమిళనాడు వ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసన చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము ముందు నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నామని స్టాలిన్ పేర్కొన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం కుట్రపూరిత చర్యగా అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## మాకొద్దీ యుద్ధం అమెరికా ప్రజల్లో అసంతృప్తి


54 శాతం మంది వ్యతిరేకం

వాషింగ్టన్: ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధంపై అమెరికా ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసా? ఈ మేరకు ఇప్సాస్–రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో ఈ యుద్ధం పట్ల అమెరికా ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెల్లడైంది. ఇరాన్‌పై దాడులను సొంత ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్‌తో దాదాపు ఏడు వారాలుగా యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్‌పై అమెరికా చర్యలను 54 శాతం మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నట్లు ఈ సర్వేలో తేలింది. ఈ యుద్ధం అనవసరమని, ఈ ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## లవ్లీ చిత్రం




## పెద్ది మళ్లీ వాయిదా




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చి బాబు సనా కాంబినేషన్ లో తెరకెక్కుతున్న పెద్ది సినిమా విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించిన ఆ చిత్రాన్ని, ఇప్పుడు జూన్ నెలకు పోస్ట్ పోన్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. కచ్చితమైన విడుదల తేదీని త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. నిజానికి.. టాలీవుడ్ లో ప్రస్తుతం భారీ అంచనాలు నెలకొన్న చిత్రాల్లో పెద్ది ఒకటి. ఆ సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదలైన గ్లింప్స్, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో ఆ మూవీపై మెగా అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో విడుదల తేదీపై వచ్చిన తాజా ప్రకటన అభిమానుల్లో చర్చకు దారి తీసింది. మేకర్స్ వివరాల ప్రకారం, పెద్ది సినిమా టాకీ పార్ట్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉంది. మరోవైపు ఎడిటింగ్ పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని, సినిమా అవుట్ పుట్ పై మేకర్స్ సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అయినప్పటికీ, ప్రేక్షకులకు మరింత మెరుగైన థియేట్రికల్ అనుభవం అందించాలనే ఉద్దేశంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులకు అదనపు సమయం కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా సినిమాను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని చిత్ర బృందం కృషి చేస్తోంది. ఈ క్రమంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు ప్రస్తుతం చెన్నైలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తో కలిసి రీ-రికార్డింగ్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ముఖ్యంగా సెకండాఫ్ కు సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## రణ్‌బీర్‌తో కలిసి షూటింగ్ చేయలేదు: యశ్

నితేశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న భారీ చిత్రం 'రామాయణ' కోసం యావత్ భారతదేశం ఎదురుచూస్తోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యశ్ నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, తాజాగా యశ్ ఈ సినిమా గురించి కొన్ని క్రేజీ అప్‌డేట్స్ పంచుకున్నారు. మొదటి భాగంలో రాముడు, రావణుడు ఎదురుపడతారా? అసలు




వీరిద్దరి మధ్య సీన్లు ఉన్నాయా? అనే విషయాలపై యశ్ క్లారిటీ ఇచ్చారు. రణ్‌బీర్ కపూర్, తాను కలిసి ఇప్పటివరకు ఒక్క సీన్ కూడా షూట్ చేయలేదని యశ్ బాంబు పేల్చారు. 'రామాయణ' మొదటి భాగంలో రాముడు, రావణుడి మధ్య ఎలాంటి సన్నివేశాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. అంటే, కథ ప్రకారం తొలి భాగంలో రాముడి జీవితం, ఆయన వనవాసం.. మరోవైపు రావణుడి లంక సామ్రాజ్యం గురించి విడివిడిగా చూపించే అవకాశం ఉంది. వీరిద్దరి మధ్య అసలైన పోరాటం, కీలక ఘట్టాలు అన్నీ రెండో భాగంలోనే ఉంటాయని యశ్ మాటలను బట్టి అర్థమవుతోంది.

## వీరనారిగా తాప్సీ



బాలీవుడ్ లో విలక్షణమైన కథాంశాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తాప్సీ. తాజాగా అత్యంత సాహసోపేతమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానున్న మిస్టరీ థ్రిల్లర్ కి గాంధారి అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రం కథా పరంగానే కాక తాప్సీ చేసే యాక్షన్ విన్యాసాలతో సరికొత్త చర్చకు దారితీసేలా కనిపిస్తోంది. పురాణాల్లోని గాంధారి పాత్రలో తన కళ్లకు గంతలు కట్టుకుని జీవించినట్లే? ఆధునిక కాలపు గాంధారి కూడా క్లిష్ట పరిస్థితిలో చూపు లేకపోయినా శత్రువులను ఎలా ఎదుర్కొంది అనేది ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఇందుకోసం తాప్సీ ప్రత్యేకంగా శిక్షణ పొంది. తనలోని ఇంద్రియ జ్ఞానాన్ని ఉపయోగించి పోరాటాలు చేయడం విశేషం. సాధారణంగా ఇలాంటి యాక్షన్ సన్నివేశాల కోసం నటీనటులు డూప్‌లను ఆశ్రయిస్తుంటారు. కానీ తాప్సీ మాత్రం ఎలాంటి డూప్ లేకుండా తానే రిస్క్ తీసుకుని ఆ సన్నివేశాల్లో నటించింది. గంతలు కట్టుకుని ఫైట్ చేయడం, దూరం, దిశను అంచనా వేయడం కష్టమవుతుంది. తద్వారా గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయినా పాత్రలో సహజత్వం కోసం తాప్సీ రాజీ పడలేదు. ఇది ఆమెలోని అంకితభావాన్ని నిరూపిస్తోంది.



## కృతి శెట్టి పరిస్థితి ఏంటో?


టాలీవుడ్‌లో ఎంట్రీతోనే బ్లాక్ బస్టర్ అందుకున్న హీరోయిన్‌గా గుర్తింపు పొందిన కృతి శెట్టి ప్రస్తుతం కెరీర్లో కఠిన దశను ఎదుర్కొంటోంది. ఉప్పెనతో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఆమెకు, ఆ తరువాత వరుస ఆఫర్లొచ్చాయి. వాటిలో బంగార్రాజు, శ్యామ్ శింగరాయ్ తప్ప మిగిలినవన్నీ ఫ్లాపులవడంతో డౌన్‌ఫాల్‌ను చూసింది. టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గడంతో, కొత్త అవకాశాల కోసం కోలీవుడ్ వైపు అడుగులు వేసిన కృతి, అక్కడైనా తన లక్ మారుతుందనే ఆశ పెట్టుకుంది. అయితే, అక్కడ కూడా ఆమెకు ఆశించిన ఫలితాలు దక్కకపోవడం గమనార్హం. సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా మొదలైన ఆమె ప్రయాణం, ఇప్పుడు స్ట్రగుల్ ఫేజ్‌గా మారడం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. అయితే టాలీవుడ్ లో లక్ కలిసి రావడం లేదని, కోలీవుడ్‌కి వెళ్లి చేసిన తాజా ప్రయత్నాలు కూడా కృతికి నిరాశనే మిగిల్చాయి. వా వాతియార్ లో కార్తీతో జోడీగా కనిపించినా, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. తరువాత రీసెంట్ గా లవ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ప్రదీప్ రంగనాథన్ తో కలిసి నటించినా, ఆ ప్రాజెక్ట్ కూడా విజయాన్ని అందించలేకపోయింది. ముఖ్యంగా విఘ్నేష్ శివన్ లాంటి డైరెక్టర్ తో పని చేసినా హిట్ రాకపోవడం, కృతి కెరీర్‌పై మరింత ప్రభావం చూపింది. మంచి బ్యానర్లు, పేరున్న నటులతో సినిమాలు చేసినా ఫలితం లేకపోవడంతో కృతికి ప్రతీసారీ నిరాశ తప్పడం లేదు.

## డిస్నీలో 1000 మంది తొలగింపు

ప్రముఖ హాలీవుడ్ సంస్థ 'ద వాల్ట్ డిస్నీ కంపెనీ' భారీ స్థాయిలో ఉద్యోగాల కోతను ప్రకటించింది. బాబ్ ఇగర్ వారసుడిగా బాధ్యతలు చేపట్టిన కొత్త సీఈఓ జోష్ డి అమారో, పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. తాజా సమాచారం ప్రకారం సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించబోతున్నారు. ఈ మేరకు జోష్ డి అమారో ఉద్యోగులకు ఒక మెమో పంపారు. మార్కెటింగ్ విభాగం, స్టూడియోలు, టీవీ వ్యాపారాలు, ఈఎస్‌పీఎన్, ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీతో పాటు కొన్ని కార్పొరేట్ విభాగాల్లో ఈ కోతలు ఉండబోతున్నాయి. మార్కెటింగ్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అసద్ అయ్యాజ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'యూనిఫైడ్ మార్కెటింగ్ స్ట్రక్చర్'లో భాగంగా ఈ మార్పులు చేస్తున్నారు.

## యానిమల్‌కి మించి స్పిరిట్‌లో ఇంటిమేట్ సీన్స్!

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, షాలిని పాండే జంటగా సందీప్ రెడ్డి వంగ రూపొందించిన సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ అర్జున్‌రెడ్డి. ఈ సినిమాలో లిప్ లాక్ సీన్‌లపై వివాదం చెలరేగడం తెలిసిందే. అ తరువాత కూడా ఇందులోని ఇంటిమసీ సీన్‌లపై కూడా విమర్శలొచ్చాయి. అయినా సరే సినిమా బాక్సాఫీస్ వద్ద పాథ్ బ్రేకింగ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచి సంచలనం సృష్టించింది. హీరోగా విజయ్ దేవరకొండకు తిరుగులేని గుర్తింపుని తెచ్చి పెట్టింది. దర్శకుడిగా సందీప్‌రెడ్డి వంగకు కల్ట్ మూవీస్ డైరెక్టర్‌గా పాపులారిటీని అందించింది. ఈ సినిమాతో బాలీవుడ్‌కు వెళ్లిన సందీప్ దీన్నే అక్కడ కబీర్‌సింగ్ పేరుతో చేసి అక్కడ కూడా బ్లాక్ బస్టర్ హిట్‌తో పాటు కాంట్రవర్సీలని కూడా ఎదుర్కోవడం తెలిసిందే.



## బోల్డ్ సీన్‌పై కియారా మల్లగుల్లాలు



పాన్ ఇండియా లెవల్‌లో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా ఇప్పుడు కేవలం కంటెంట్ వల్లే కాదు, కాంట్రవర్సీ వల్ల కూడా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కియారా అద్వానీ చుట్టూ తిరుగుతున్న ఓ బోల్డ్ సీన్ వివాదం ఇండస్ట్రీలో పెద్ద డిబేట్‌కు దారి తీసింది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఎప్పుడూ ఒక లిమిట్‌లోనే ఉన్న కియారా, ఈసారి కథ డిమాండ్ మేరకు ఓ సాహసోపేత సన్నివేశంలో నటించిందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఫైనల్ అవుట్‌పుట్ చూసిన తర్వాత, ఆ సీన్ తన పబ్లిక్ ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందేమోనని ఆమె ఆందోళన చెందుతూ, దాన్ని తొలగించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత హీరోయిన్‌గా తీసుకునే నిర్ణయాల్లో మార్పు వస్తుందా అనే ప్రశ్న కూడా ఈ సందర్భంలో ముందుకు వచ్చింది. పెళ్లి తర్వాత పబ్లిక్ పర్సెప్షన్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టడం సహజమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే టైమ్ లో డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తన కథకు ఆ సీన్ కీలకమని భావిస్తే, హీరోయిన్ కంఫర్ట్ కూడా అంతే ముఖ్యమని మరో వర్గం చెబుతోంది. దీంతో క్రియేటివ్ ఫ్రీడమ్, నటీనటుల వ్యక్తిగత ఇమేజ్ మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఒకవేళ ఆ సీన్‌ను సినిమాలో ఉంచితే, రిలీజ్‌కు ముందే భారీ పబ్లిసిటీ రావడం ఖాయం. సోషల్ మీడియాలో ట్రెండింగ్, డిబేట్లు, కాంట్రవర్సీలు.. అన్నీ కలిసి సినిమాకు ఫ్రీ హైప్ తెచ్చే అవకాశం ఉంది. కానీ అదే సమయంలో నెగిటివ్ ట్రోలింగ్, విమర్శలు, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వచ్చే రియాక్షన్ కూడా పెద్ద రిస్క్‌గా మారొచ్చు. ఈ హైప్ సినిమాకి ప్లస్ అవుతుందా? లేక అసలు కథను మింగేస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఈవార్తలు
# క్రీడావాణి SPORTS
గురువారం 16-4-2026, జగిత్యాల | www.evarthalu.com | 7





# ఆర్సీబీ విజయాల జోరు

## లక్నోపై కోహ్లీ మెరుపులు.. బౌలింగ్‌లో రసిక్, భువీ సత్తా

ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) జైత్రయాత్ర కొనసాగుతోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో బుధవారం చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో రసిక్ సలామ్, భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగితే.. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. రసిక్ సలామ్(4/24)తో పాటు స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్(3/27) మూడు వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్యా(2/36) రెండు వికెట్లు పడగొట్టాడు. జోష్ హజెల్‌వుడ్‌కు ఒక వికెట్ దక్కింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40), ఆయుష్ బదోని(24 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 38), ముకుల్ చౌదరి(28 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. అనంతరం ఆర్సీబీ 15.1 ఓవర్లలో 5 వికెట్లకు 149 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ(34 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. రజత్ పటిదార్(13 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 27), జితేష్ శర్మ(9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 23) దూకుడుగా ఆడారు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్(3/32) మూడు వికెట్లు తీయగా.. ఆవేష్ ఖాన్(2/23) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. 146 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి ఆశించిన శుభారంభం దక్కలేదు. రెండో ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్(7) వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో విరాట్ కోహ్లీ అద్భుతమైన బ్యాటింగ్‌తో లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై కోహ్లీ 49 పరుగులు చేయడంతో ఆర్సీబీ విజయం లాంఛనమైంది. ఆ తర్వాత బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోయినా.. ఆర్సీబీ సునాయస విజయాన్నందుకుంది. కోహ్లీ కూడా ఆరంభంలోనే ఔటై ఉంటే మ్యాచ్ మరింత ఉత్కంఠగా సాగేది. అయితే లక్నో బ్యాటర్లు కూడా 20-30 పరుగులు తక్కవగా చేశారు. ఆర్సీబీ బౌలర్ల అద్భుత ప్రదర్శనతో లక్నో బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు.



## గంభీర్‌కు శత్రువులు ఎక్కువ: మునాఫ్ పటేల్

టీమ్ ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్‌కు బీసీసీఐలోనే శత్రువులు ఉన్నారని భారత మాజీ క్రికెటర్ మునాఫ్ పటేల్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రెండు ఐసీసీ టైటిల్స్ గెలిచిన తర్వాత కూడా గంభీర్‌పై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో జట్టు వైఫల్యాన్ని ఎత్తుచూపుతున్నారు. తన ముక్కుసూటి వైఖరితో కూడా అతను ట్రోలింగ్ ఎదుర్కొంటున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మునాఫ్.. గంభీర్ గురించి మాట్లాడాడు. హెడ్ కోచ్‌గా గంభీర్ వెళ్లిపోతే భారత జట్టు పరిస్థితులు అస్తవ్యస్తంగా మారుతాయంటూ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'అతను భారత జట్టు సిస్టమ్‌ను నియంత్రించగలడు. ఏ ప్లేయరైనా తప్పు చేస్తే అతన్ని తొలగించే ధైర్యం గంభీర్‌కు ఉంది. అతను స్నేహితుడిగా ఉండలేదు. అలా ఉంటే సిస్టమ్‌ను నాశనం చేసినట్టే. గంభీర్‌కు ఎంత మంది శత్రువులు ఉన్నారో తెలుసా. కామెంటరీ ప్యానెల్‌లో 10 మందిలో 8 మందికి నచ్చడు. ఐదుగురు సెలెక్టర్లలో నలుగురు అతనికి వ్యతిరేకం. అయినప్పటికీ తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు.'అని మునాఫ్ తెలిపాడు. 'ఒక్క విషయం గుర్తుంచుకోండి. గంభీర్‌ను తీసిస్తే ప్లేయర్లను హ్యాండిల్ చేయడం చాలా కష్టం. అతను నిజాయితీపరుడు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడుతాడు. చాలా మందికి అది నచ్చదు. గంభీర్ తప్ప ఇతర కోచ్‌లు ప్లేయర్లను హ్యాండిల్ చేయలేరు. ఎందుకంటే అతనికి భయపడతారు. గంభీర్‌కు మనీ కాదు క్రికెట్ అంటే ప్రేమ'అని మునాఫ్ చెప్పుకొచ్చాడు.



### ఫిడే క్యాండిడేట్స్

# టైటిల్ వైశాలి కైవసం

**వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు క్వాలిఫై**



భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి అదరగొట్టింది. ఫిడే మహిళల క్యాండిడేట్స్ టోర్నీ విజేతగా నిలిచింది. ఈ టోర్నీ చరిత్రలో టైటిల్ గెలిచిన తొలి భారత క్రీడాకారిణిగా ఆమె ఘనత సాధించింది. అంతేకాకుండా ఈ ఏడాది జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌ను కూడా ఖాయం చేసుకుంది. 13 రౌండ్లు ముగిసే సరికి వైశాలి 7.5 పాయింట్లతో కజకస్థాన్‌కు చెందిని బిబిసారా అస్సాబయేవాతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. విజేతగా నిలవాలంటే ఆఖరి రౌండైన 14వ రౌండ్‌లో వైశాలి గెలవాలి. తప్పక గెలవాల్సిన 14వ రౌండ్‌లో ఆమె సత్తాచాటింది. ఉక్రెయిన్‌కు చెందిన కాటేరినా లగ్నోను ఓడించింది. 48 ఎత్తుల్లో వైశాలి పైచేయి సాధించి 8.5 పాయింట్స్‌తో విజేతగా నిలిచింది. వైశాలికి మరో భారత గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ కూడా ఓ రకంగా సహాయం చేసింది. బిబిసారా అస్సాబయేవాతో తలపడిన దివ్య 14వ రౌండ్‌ను డ్రా చేసుకుంది. ఒకవేళ దివ్యపై బిబిసారా గెలిచి ఉంటే ఆమె, వైశాలి స్కోర్లు సమం అయ్యేవి.



## రహానేకు 12 లక్షల జరిమానా

కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానేకు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది.

## గాయంతో రోహిత్ ఔట్!



ఐపీఎల్-2026లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గాయం కారణంగా రాబోయే రెండు కీలక మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన గత మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా రోహిత్ శర్మ గాయపడ్డారు. నొప్పి తీవ్రం అవ్వడంతో ఆయన మధ్యలోనే 'రిటైర్డ్ హర్ట్'గా గ్రౌండ్‌ను వీడాడు. వైద్య పరీక్షల అనంతరం, రోహిత్ శర్మకు విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచించినట్లుగా తెలుస్తోంది. ముంబై ఇండియన్స్ తదుపరి ఆడబోయే రెండు ముఖ్యమైన మ్యాచ్‌లకు రోహిత్ దూరం కానున్నట్లు తాజా కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే ముంబైకి ప్రతి మ్యాచ్ కీలకమైన తరుణంలో రోహిత్ వంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు లేకపోవడం జట్టుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రోహిత్ శర్మ గాయం తీవ్రతపై ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఇంకా అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే, వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలు ముందున్న నేపథ్యంలో రోహిత్ విషయంలో రిస్క్ తీసుకోవద్దని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లుగా సమాచారం. అయితే, అతడి ప్లేస్‌లో తుది జట్టులోకి ఎవరిని తీసుకుంటారనేది హాట్ టాపిక్‌గా మారింది.



## పంత్‌కు గాయం

**హాజెల్‌వుడ్ బౌన్సర్‌తో చేతికి దెబ్బ**

లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో రిషభ్ పంత్ మోచేతికి బంతి బలంగా తాకింది. ఆర్సీబీ స్టార్ పేసర్ హాజెల్ వుడ్ వేసిన షార్ట్ పిచ్ బాల్ ఆడబోయిన పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. బంతి నేరుగా రిషభ్ పంత్ మోచేతికి బలంగా తాకింది. దాంతో నొప్పితో విలవిలలాడిన పంత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్ సందర్భంగా ఐదో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. రసిక్ సలామ్ వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతికి ఎయిడెన్ మార్క్‌రమ్ క్యాచ్ ఔట్ కావడంతో రిషభ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. జోష్ హాజెల్ వుడ్ తన బౌన్సర్లతో రిషభ్ పంత్‌ను ఇబ్బంది పెట్టాడు. ఈ ఓవర్ నాలుగో బంతి పంత్‌క గాయపడి మైదానం వీడాడు. తీవ్రంగా గాయపడిన రిషభ్ పంత్‌ను హాజెల్ వుడ్ ఓదార్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. రిషభ్ పంత్ వెనుదిరిగడంతో నికోలస్ పూరన్ క్రీజులోకి రాగా.. అతని తన మరుసటి ఓవర్‌లో హాజెల్ వుడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మిచెల్ మార్ష్‌ను కూడా హాజెల్ వుడ్ తన బౌలింగ్‌తో ఇబ్బంది పెట్టాడు. హాజెల్ వుడ్ వేసిన ఓ బంతి మిచెల్ మార్ష్ నడుముకు బలంగా తాకింది. మొత్తం 4 ఓవర్లు వేసిన హాజెల్ వుడ్ 20 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసాడు. లక్నో బ్యాటర్లు దారుణంగా విఫలమవడంతో చేతికి కట్టు కట్టుకొని పంత్ తిరిగి బ్యాటింగ్‌కు వచ్చాడు. కానీ ఒక్క పరుగుకే పెవిలియన్ చేరాడు. భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఇప్పటికే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, ధోని వంటి స్టార్ ఆటగాళ్లు గాయాలతో ఇబ్బంతి పడుతుండగా.. తాజాగా పంత్ ఈ జాబితాలో చేరాడు. రిషభ్ పంత్ గాయం తీవ్రత ఎక్కువైతే లక్నో సూపర్ జెయింట్స్‌కు మరిన్ని కష్టాలు తప్పవు.

ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 16-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# డీలిమిటేషన్.. రాజకీయం

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అనేది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన ప్రక్రియ. 2026 తర్వాత జరగనున్న ఈ ప్రక్రియ దేశ భవిష్యత్తును నిర్ణయించనుంది. 'ఒక వ్యక్తి - ఒక ఓటు - ఒకే విలువ' అనే ప్రజాస్వామ్య సూత్రం అమలు కావాలంటే ప్రతి నియోజకవర్గంలో దాదాపు సమాన సంఖ్యలో జనాభా ఉండాలి. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాల్లో 20 లక్షల పైచిలుకు జనాభా ఉంటే, మరికొన్నింటిలో 10 లక్షల లోపే ఉన్నారు. ఈ వ్యత్యాసాన్ని డీలిమిటేషన్ తొలగిస్తుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు అమలు కావాలంటే నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని కేంద్రం పేర్కొంటున్నది. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 850 వరకు పెంచడం వల్ల నియోజకవర్గాలు చిన్నవిగా మారి, ప్రజలకు తమ ప్రతినిధులు మరింత అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. అయితే, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాల (ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్) ప్రాతినిధ్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యత తగ్గుతుంది. కేవలం కొన్ని రాష్ట్రాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి వస్తే, అది దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నది వాస్తవం. జనాభాను అదుపులో ఉంచి, సామాజిక అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గడం అనేది వారు చేసిన మంచి పనికి శిక్ష వేసినట్లు అవుతుంది. అయితే, కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో సమానంగా సీట్లను పెంచే ఆలోచన చేస్తోంది (ఉదాహరణకు 50% పెంపు). దీనివల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినకుండా చూడొచ్చు. నియోజకవర్గాల పునర్విభజన అనేది సాంకేతికంగా అవసరమైన ప్రక్రియే అయినప్పటికీ, అది దేశంలోని రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలకు దారితీయకూడదు. జనాభా ప్రాతిపదికన మాత్రమే కాకుండా, అభివృద్ధి, జాతీయ ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడే డీలిమిటేషన్ దేశానికి నిజంగా మేలు చేస్తుంది.

# మత స్వేచ్ఛ..
## రాజ్యాంగ పరిమితి

**భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం మాత్రమే కాదు.. ఇది శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అన్యాయాలకు సమాధానం చెప్పే న్యాయవేదిక. ముఖ్యంగా అణగారిన వర్గాలైన దళిత వర్గాలు, అనుసూచిత తెగలకు ఇచ్చిన రక్షణలు ఆ చరిత్రాత్మక బాధలను సరిచేయాలనే సంకల్పానికి ప్రతీక. అయితే ఆ రక్షణలు ఎవరికీ, ఏ పరిమితిలో వర్తించాలి అన్నది కూడా రాజ్యాంగమే నిర్దేశించిన సూత్రాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో, మత మార్పిడి అనంతరం దళిత హోదా కొనసాగుతుందా అన్న కీలక ప్రశ్నపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు రాజ్యాంగ స్ఫూర్తిని మళ్లీ గుర్తు చేసింది.**



మార్చి 24, 2026న న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్.వి. అంజారియా ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పు స్పష్టంగా పేర్కొంది - హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు మాత్రమే దళిత హోదా వర్తిస్తుంది. ఇతర మతాలను స్వీకరించిన క్షణం నుంచి ఆ హోదా పూర్తిగా నిలిచిపోతుంది. ఇది 1950లోని రాజ్యాంగ ఆదేశంలోని మూడో ఉపవిభాగాన్ని పునరుద్ఘాటించిన తీర్పు. ఈ కేసు వెనుక ఉన్న వాస్తవాలు కూడా ఆసక్తికరమే. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించి పాస్టర్‌గా సేవలు అందిస్తూ ఉన్నారు. తనపై కుల వివక్ష జరిగిందని ఆరోపిస్తూ ఆయన దళితులు, తెగలపై అఘాయిత్యాల నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేశారు. కానీ న్యాయస్థానాలు ఒక కీలక విషయాన్ని గుర్తుచేశాయి. మత మార్పిడి అనంతరం కుల హోదా చట్టపరంగా నిలవదని, హైకోర్టు ఇచ్చిన ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం ద్వారా, చట్టం ఉద్దేశ్యం ఏమిటో స్పష్టతనిచ్చింది. రాజ్యాంగం ఎందుకు ఇలాంటి పరిమితులు విధించింది? దళిత హోదా హిందూ సమాజంలో ఉన్న అస్పృశ్యత, వివక్షతల వంటి సామాజిక దురాచారాల నివారణ కోసం రూపొందించబడింది. తర్వాత కాలంలో సిక్కు, బౌద్ధ మతాలను కూడా ఈ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ క్రైస్తవం, ఇస్లాం వంటి మతాలు సిద్ధాంతపరంగా కులవ్యవస్థను అంగీకరించవు. అందువల్ల ఆ మతాలలోకి మారిన వ్యక్తి ఆ సామాజిక సంకెళ్ల నుండి బయటపడినట్లు రాజ్యాంగం భావించింది. ఇదే భావనను సుప్రీంకోర్టు గతంలోనూ పునరుద్ఘాటించింది. తాజా తీర్పు ఆ సూత్రానికి మరింత బలం చేకూర్చింది. ఈ తీర్పు ద్వారా ఒక ముఖ్యమైన సందేశం వెలువడింది.. రాజ్యాంగ రక్షణలు వ్యక్తిగత అభిరుచుల ప్రకారం మారవు, అవి నిర్దిష్ట సామాజిక వాస్తవాల ఆధారంగా మాత్రమే అమలులో ఉంటాయి. దళితులు, తెగలపై అఘాయిత్యాల నిరోధక చట్టం దుర్వినియోగం కాకుండా నిరోధించడంలో ఈ తీర్పు కీలక పాత్ర పోషిస్తుంది. అదే సమయంలో, మత మార్పిడి తర్వాత కూడా సామాజిక వివక్ష కొనసాగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇది మరింత లోతైన చర్చకు దారి తీసే అంశం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఆ నివేదిక భవిష్యత్ విధానాలకు దారితీసే అవకాశముంది. కానీ న్యాయస్థానం పరిధి మాత్రం స్పష్టమైనది.. చట్టాన్ని దాని అసలు ఉద్దేశ్యంతో అమలు చేయడం. మొత్తానికి, ఈ తీర్పు ఒక వ్యక్తిగత కేసు పరిధిని దాటి రాజ్యాంగ సమతుల్యతను కాపాడే మార్గదర్శిగా నిలుస్తోంది. ఇది మత స్వేచ్ఛను గౌరవిస్తూ, అదే సమయంలో రాజ్యాంగ పరిమితులను గుర్తు చేస్తోంది. హక్కులు, బాధ్యతలు, రక్షణలు.. ఇవన్నీ సమతుల్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ తీర్పు మళ్లీ చాటిచెప్పింది. భారతదేశం వైవిధ్యాల సమాహారం. కానీ ఆ వైవిధ్యాన్ని నిలబెట్టేది రాజ్యాంగం. ఆ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడే ప్రతి తీర్పు.. సమాజానికి ఒక దిక్సూచి. ఈ తీర్పు కూడా అలాంటి మార్గదర్శకమే.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్



# మతం మారితే సర్టిఫికెట్
# రద్దు కావాల్సిందే



పగుడాకుల బాలస్వామి
ధర్మచార్య సంపర్క ప్రముక్
విశ్వహిందూ పరిషత్, తెలంగాణ
ఫోన్ నంబర్: 9912975753

అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. అంటే.. హిందూ ధర్మంలో వివక్షను ఎదుర్కొంటున్న వారికి మాత్రమే రిజర్వేషన్లు అమలు కావాలని, హిందూ ధర్మాన్ని వీడి క్రైస్తవ మతం ఆచరిస్తున్న వ్యక్తులకు రిజర్వేషన్ పొందే అర్హత లేదు. ఇదే విషయాన్ని డాక్టర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం చాలామంది దళితులు సర్టిఫికెట్‌లో హిందూ మతాన్ని చూపిస్తూ.. నిత్యజీవితంలో క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. సామాజికంగా అసమానతలు ఎదుర్కొంటున్న వారికి మాత్రమే రిజర్వేషన్ ఫలాలు అందాలి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ.. సర్టిఫికెట్ కోసమే హిందూ ధర్మం కావాలి.. విద్య, ఉద్యోగం,వ్యాపారం, రాజకీయం తోపాటు పలు ప్రభుత్వ ఫలాలు పొందడం కోసం ఎస్సీ సర్టిఫికెట్ కావాలి అనుకోవడం అత్యంత కుట్రపూరిత చర్య. మతం మారిన తర్వాత ఎస్సీ సర్టిఫికేట్ ఉపయోగిస్తూ పొందుతున్న ఫలాలు అన్ని కూడా రాజ్యాంగ విరుద్ధం. ఈ చర్య వల్ల నిజమైన దళితులకు (లబ్ధిదారులకు) తీరని అన్యాయం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అన్ని మండలాల ఎమ్మార్వోలు స్పందించి, ఎస్సీ సర్టిఫికెట్ జారీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న అనేక సబ్సిడీ ఫలాలు కూడా హిందూ మతం వీడిన క్రైస్తవులు పొందుతున్నారు. ఇది పట్టపగలు చేసే దోపిడీ. విద్యా, ఉద్యోగం, రాజకీయాలలో కూడా నిజమైన ఎస్సీ లబ్ధిదారుల పొట్ట కొట్టి, వారి నోటికాడి ముద్దను లాక్కొని మతం మారిన క్రైస్తవులు ఎంజాయ్ చేయడం ద్రోహం. ఈ విషయంపై మేం కూడా భారీ స్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతాం. మన చుట్టుపక్కల ఇంతటి వారైనా సరే హిందూ సర్టిఫికెట్ పొంది, ప్రభుత్వపరంగా ఫలాలు అనుభవిస్తున్న వ్యక్తులు మతం మారినట్లు తెలిస్తే , వెంబడే ఆయా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఈ విధమైన న్యాయపోరాటంతోనే నిజమైన లబ్ధిదారులకు మేలు కలుగుతుంది. కొంతమంది దళిత నాయకులుగా చెప్పుకుంటున్నటువంటి వ్యక్తులు మతం మారి, తిరిగి రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. అది ముమ్మాటికి ద్రోహం అన్నారు. మతం మారిన వారు క్రైస్తవులుగా చలామణి అవుతున్నటువంటి వారు సుప్రీంకోర్టు తీర్పును ప్రశ్నిస్తూ పోరాటం చేస్తామనడం అంబేద్కర్‌పై, అంబేద్కర్ ఆశయాలపై ఎదురు దాడి చేసినట్లే. రిజర్వేషన్లు పొందుతూ మతం మారిన వ్యక్తులు అంబేద్కర్ ఆశయాలను ప్రశ్నించే స్థాయికి ఎదగడం విడ్డూరం. వాస్తవాలు తెలుసుకోవాలి కానీ, వాటిని వక్రీకరించే వ్యవహారం చేయడం దుర్మార్గం. హిందూ, బౌద్ధ, సిక్కు మతాలలో మాత్రమే సామాజిక అసమానతలు, వివక్ష ఉన్నది. కాబట్టి ఆయా మతాల వారికి మాత్రమే రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ విషయంలో గ్రామీణ స్థాయి నుంచి మొదలుకొని విశ్వవిద్యాలయాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ హిందూ ధర్మం నచ్చకపోయినట్లయితే స్వచ్ఛందంగా హిందుత్వంలోని సర్టిఫికెట్ వీడి, బీసీ సర్టిఫికెట్ పొంది క్రైస్తవ మతం ఆచరించుకోవడంలో ఎవరికి అభ్యంతరం లేదు. బీసీలు, ఓసీలు, ఎస్టీలు కూడా హిందుత్వాన్ని వీడి సర్టిఫికెట్ ఆధారంగా లబ్ధి పొందుతున్నారు, అది కూడా ద్రోహం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ డబ్ల్యూఎస్ స్కీం కూడా వీడాలి. హిందూ జీవన విధానం నచ్చకపోతే వెంటనే ఆ సర్టిఫికెట్లు కూడా రద్దు చేసుకొని, నచ్చిన మతాన్ని స్వీకరించుకోవచ్చు. కానీ హిందూమతం ఆధారంగా సర్టిఫికెట్ పొంది ప్రభుత్వ ఫలాలు అనుభవిస్తామంటే అది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అనే విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు కోసం ఆయా అధికారులు అప్రమత్తంగా ఉండాలి. చదువుకున్న ప్రతి ఒక్కరిని అవగాహన పరిచి, అక్రమ ఫలాలు అనుభవిస్తున్న వారి భరతం పట్టడం కోసం న్యాయపోరాటం చేస్తాం. మతం మారిన వారి సర్టిఫికెట్ రద్దు కోసం ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోం. రిజర్వేషన్లలో రాజకీయ పదవులు అనుభవిస్తున్న నాయకులు వారి ఒరిజినల్ మతం ఏమిటో, ఆచరిస్తున్న జీవన విధానం ఏదో ప్రజలకు స్పష్టం చేయాలి.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.